# వరి రైతు విలవిల

● చివరికి తడిసి ముద్దయిన ధాన్యం ● ఆరుగాలం పండించిన రైతన్నపై ప్రకృతి కన్నెర


వెంగ్వాపేట్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

సోన్, డిసెంబర్ 5 : జిల్లావ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం ఒక్క సారిగా గంటపాటు కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి మొదట్లో ఏపుగా పెరగడంతోపాటు పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషించారు. తమ తమ కష్టాలు దూరమవుతాయని భావించారు. కానీ.. పొట్ట దశకు వచ్చే సరికి దోమ పోటు, ఎండు తెగులు, ఆకుముడత వంటి రోగాలు రావడంతో మందులను పిచికారీ చేశారు. ప్రస్తుతం వరి సాగుకు ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుండగా.. అవి కూడా వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ కారణంగా వారం రోజుల నుంచి వాతావరణం అనుకూలించకపోగా.. గురువారం ఉదయం కొంచెం ఎండ వెళ్లడంతో సంబురంగా రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. అయితే మధ్యాహ్నం ఒక్కసారిగా అనుకోకుండా గంటపాటు కురిసిన వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. నిర్మల్, సోన్ మండలంలోని ఆయా గ్రామాల్లోని వరిని సాగు చేయగా.. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయింది. నిర్మల్ మండలం వెంగ్వాపేట్, చిట్యాల్, తల్వేద, మంజులాపూర్, ముజ్గి, ముఠాపూర్, సోన్ మండలంలోని కడ్తాల్ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసినట్లు తెలిపారు. సుమారుగా గంటపాటు కురిసిన వర్షానికి నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలోని పేరుకుపోయిన ధాన్యం కుప్పలపైన రైతులు కప్పుకునేందుకునే తంటాలు పడ్డారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం చేసి తరలించాలని రైతులు కోరుతున్నారు.

## నిందితుడికి నాలుగేళ్ల జైలు

సోన్, డిసెంబర్ 5 : నిర్మల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎల్లుల చందు అలియాస్ ఎల్లుల చంద్రశేఖర్ 15 ఏండ్ల బాలికపై లైంగికదాడికి యత్నం చేశాడు. ఈ మేరకు నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మార్చి 31, 2021న చందు లైంగికదాడికి పాల్పడగా అప్పటి ఎస్సై సోమ సుమన్, డీఎస్పీ ఉపేందర్‌లు కేసు దర్యాప్తు చేసి చార్జిషీటు వేశారు. స్పెషల్ పీసీ విశ్వాస్‌రెడ్డి పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో నేరస్తునికి నాలుగేండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులకి శిక్ష పడడంలో కృషి చేసిన ప్రాసిక్యూషన్ అధికారి విశ్వాస్‌సాగర్‌రెడ్డి, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు ఉపేందర్‌రెడ్డి, అదనపు ఎస్పీ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జైకిస్టు, హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌లను ఎస్పీ అభినందించారు.

# లంచావతారుల గుండెల్లో దడ

అవినీతిపరుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న ఏసీబీ అధికారులు


ఏసీబీకి పట్టుబడిన మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్

● జిల్లాలో వరుస ఘటనలు.. అయినా మారని యంత్రాంగం తీరు..
● ప్రజల్లో వెల్లివిరిస్తున్న చైతన్యం.. లంచం అడిగితే ఫిర్యాదు చేయండి..

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : ప్రజల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులది. కానీ. వారి బాధ్యతను మరిచి వేలల్లో జీతాలు తీసుకుంటూ.. వారి హోదాను మరిచి ప్రజలను లంచం పేరిట పీడిస్తున్నారు. ఏ శాఖలో అయినా పని జరగాలంటే పైసలు ఇవ్వాల్సిందేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు శాఖల్లో కొంత మంది అధికారులు ప్రతి పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో పని మూడు, ఐదు, ఏడు, 15 రోజుల్లో పూర్తి చేయాలి. కానీ.. కొన్ని శాఖల్లో నిబంధనలు పక్కనబెట్టి ప్రతి పనికి పైసలు డిమాండ్ చేస్తున్నారు.

### జిల్లాలో వరుస ఘటనలు

- దడువాయి (వే మాన్) లైసెన్స్ కోసం మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి తంగిడిపల్లి శ్రీనివాస్ రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.
- గత నెల 29న ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జగదీశ్, అటెండర్ ప్రశాంత్‌లు సల్లా హరీష్ నుంచి సేత్వార్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- నిర్మల్ మున్సిపాల్టీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శాఖీర్ ఖాన్ సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేసేందుకు బిల్ కలెక్టర్ నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- 2024 జనవరి 10న కడెం తహసీల్దార్ రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యలు గిఫ్ట్ డీడీకి రూ.9 వేల లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు.
- జనవరి 25న నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్ ఇంటి అసిస్‌మెంట్‌కు రూ.3500 తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.

### ప్రజల్లో వెల్లివిరుస్తున్న చైతన్యం

చేయాల్సిన పనులకు అధికారులు చేతులు చాపడంతో ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తున్నది. లంచం అడిగితే అవినీతి అధికారులను ఏసీబీకి పట్టిస్తున్నారు. ఇప్పటి వరకు లంచావతారులను పట్టించింది యువకులు కావడం విశేషం. యువత తలచుకుంటే అవినీతి అధికారుల భరతం పట్టొచ్చని ఇటీవల జరిగిన ఘటనలే రుజువు చేస్తున్నాయి. కాగా.. కొన్ని కేసుల్లో పెద్ద మనుషులు కూడా ఏసీబీ అధికారులను ఆశ్రయించడం ప్రజల్లో చైతన్యం వెల్లివిరిస్తుందనడానికి నిదర్శనం.

### లంచం అడిగినందుకే పట్టించా..

*నిర్మల్ పట్టణానికి చెందిన సల్ల హరీశ్ సేత్వారి పట్టా కోసం సర్వే అండ్ ల్యాండ్ కార్యాలయానికి పని నిమిత్తం అధికారులను కలిశాడు. తమ పని కావాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని తేల్చి చెప్పడంతో రూ.10 వేలకు బేరం కుదిర్చారు. డబ్బులు ఇచ్చి పని చేయించుకునే ఇష్టం లేక పోవడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించా. దీంతో రూ.10 లంచం ఇస్తుండగా జూనియర్ అసిస్టెంట్ జగదీశ్, అటెండర్ ప్రశాంత్‌లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.*


- సల్ల హరీశ్ కుమార్, నిర్మల్.

# యాసంగి సాగు 1.65 లక్షల ఎకరాలు

● అధికారుల అంచనా ● అధికంగా జొన్న 70,520 ఎకరాలు



ఆదిలాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది యాసంగి సాగు 1.65 లక్షల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వానకాలంలో 5.20 లక్షల ఎకరాల్లో పత్తి, కంది, సోయా సాగు చేస్తారు. సాగునీటి వనరులు సరిగ్గా లేకపోవడంతో యాసంగి సాగు తక్కువగా ఉంటుంది. జిల్లాలో ఇప్పటికే వానకాలం పంటలు సోయా, పత్తి అమ్మకాలు కొనసాగుతున్నాయి. కంది పంట కాయ దశలో ఉంది. సోయా, పత్తి పంటలు తీసిన రైతులు యాసంగి వేస్తున్నారు. యేటా జిల్లావ్యాప్తంగా రైతులు యాసంగిలో శనగను అధికంగా సాగు చేస్తుండగా.. ఈ ఏడాది జొన్న విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జొన్న 70,520 ఎకరాలు, శనగ 68,500, మక్క 18,220, గోధుమ 4,650 ఎకరాల్లో వేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు.

### 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

యాసంగి సీజన్‌కు 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. ఇందులో యూరియా ఎనిమిది వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 12 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్‌తోపాటు ఇతర ఎరువులు 10 వేల మెట్రిక్ టన్నులు వినియోగిస్తారని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో పుష్కలంగా నీరు చేరింది. దీంతో సాగునీటి పథకాల కింద సాగు చేసే రైతులకు నీటి సమస్య లేకుండా పోయింది. బోర్లు, బావులపై ఆధారపడి రైతులు సాగు చేస్తారు. కరెంటు సమస్య లేకుంటే రైతులు తమ పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించి ఎక్కువ దిగుబడులు పొందే అవకాశాలున్నాయి.

# లారీ @ 130 టైర్లు

***నిర్మల్-భైంసా జాతీయ రహదారి-61పై గురువారం మంచిర్యాల వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తున్న 130 టైర్లతో కూడిన లారీ న్యూ లోలం వద్ద అగింది. భారీ వాహనం కావడంతో దారి పొడువున వాహనం చుట్టూ ఎనిమిది మంది అటు, ఇటు చూస్తూ వాహనాన్ని ముందుకు నడుపుతున్నారు. ఈ భారీ వాహనంలోనే వంటా వార్పు చేసుకుంటున్నారు. ఎన్‌హెచ్-61పై నుంచి వెళ్లే ప్రయాణికులు ఈ భారీ వాహనాన్ని ఆసక్తిగా తిలకించారు.***

*- దిలావర్‌పూర్, డిసెంబర్ 5*


న్యూ లోలం వద్ద నిర్మల్-భైంసా జాతీయ రహదారి-61పైన భారీ వాహనం

# అక్రమ అరెస్టులను ఆపాలి

● కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు.. ● మాజీ మంత్రి జోగు రామన్న


మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, డిసెంబర్ 5 : ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ పోరాడుతుందని.. సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలనకు త్వరలో ప్రజలే బుద్ధి చెప్తారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్ రెడ్డిల అక్రమ అరెస్టును, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నియంత, నియంతృత్వ పాలనను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తూ ఉంటే, అరెస్టులకు దిగజారడం సమంజసం కాదన్నారు. అక్రమ అరెస్టులను ఆపకుంటే తగిన మూల్యం సీఎం రేవంత్ రెడ్డి చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


బజార్‌హత్నూర్ క్రీడాకారులతో కలిసి సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ఓటమి గెలుపునకు తొలిమెట్టు

**ఎమ్మెల్యే బోథ్ అనిల్ జాదవ్**

బజార్‌హత్నూర్, డిసెంబర్ 5 : క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం, ఉత్తేజం కలుగుతుందన్నారు. అంతకుముందు సరదాగా బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో నూతనోత్తేజం కల్గించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు భగత్ వినోద్ అకాల మరణం చెందడంతో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి మౌనం పాటించారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిల్కూరి భూమయ్య బజార్‌హత్నూర్ మండల క్రికెట్ క్రీడాకారులకు జర్సీలను బహూకరించడంతో వాటిని ఎమ్మెల్యే క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ రాజారాం, యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్, నాయకులు లక్ష్మణ్, కవీందర్, జనార్దన్, సాయిచైతన్య, సకేశ్, రాము, చట్ల గజ్జయ్య, శరత్, విలాస్, సాయన్న పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, డిసెంబర్ 5 : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన కంప్యూటర్ విద్యను అందించేందుకు 10 కంప్యూటర్లు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కోసం 40 ఫ్యాన్స్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

# వ్యాధుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 5 : ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో వ్యాధుల వివరాలు నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వివరాలు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఈ నెల 9 న నిర్వహించే మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే వివరాలను నమోదు చేయాలని కోరారు. మైక్రో ఫైలేరియా శాంపిల్ కలెక్షన్ గురించి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసే విధానం గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ స్టేట్ కన్సల్టెంట్ శిరీష వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి సుధాకర్, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్ తనిఖీ

సారంగాపూర్, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం జామ్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తహసీల్దార్ శ్రీదేవి పాల్గొన్నారు.

## పురుగు మందు వాడకంతో భూసారం తగ్గుతోంది..

సోన్, డిసెంబర్ 5 : రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంతో భూసారం తగ్గుతోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్ అన్నారు. గురువారం నిర్మల్ మండలంలోని కొట్ల(కె)లో ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవ సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, మందుల మోతాదు ఎంత అవసరమో అంతే వాడాలని మోతాదుకు మించి వాడద్దని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి వసంత్‌రావు, ఏఈఓ అంబాజీ పాల్గొన్నారు.


మంగళ హారతులతో పాల్గొన్న మహిళలు

# కనుల పండువగా రథోత్సవం

ఎదులాపురం, డిసెంబర్ 5 : ఆదిలాబాద్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ గోపాలకృష్ణ రథోత్సవాన్ని గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ముందుగా మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి వేదమంత్రోచ్ఛరణల మధ్య రథానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. చుట్టూ పక్కల పల్లెలు, పట్టణంతోపాటు మహారాష్ట్ర నుంచి భారీగా జనం తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గురువారం ముక్కుమీద వేలు వేసుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికులకు రూ.10 వేల వేతనం అందించి సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

## అడవి పంది దాడిలో రైతుకు గాయాలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 5 : మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన మడావి నాగోరావ్ గురువారం మధ్యాహ్నం మెండపల్లి గ్రామ శివారంలో తన చేనులో పత్తి ఏరుతున్నాడు. ఈ క్రమంలో అడవి పంది అతనిపై ఆకస్మికంగా దాడి చేయడంతో కడుపులో తీవ్రమైన గాయమైంది. కుటుంబీకులు వెంటనే ద్విచక్రవాహంలో ముత్నూర్ గ్రామానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతంగా నాగోరావ్ ఆరోగ్యం నిలకడగానే ఉందని కుటుంబీకులు తెలిపారు.